# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## మట్టంటకుండా

మనం గుమ్మం బయట విడిచేస్తాం
మనల్నెప్పుడూ గుండెల్లోనే పెట్టుకుంటాయి
గుడి బయట విడిచినా
గుమ్మం బయట విడిచినా
ఏమీ నొచ్చుకోక
కాళ్లు ముందుకు జరపగానే
జోడెడ్లు కాడి మీదేసుకున్నట్టు
పాదాల్ని మీదేసుకుని
బాధ్యతగా బయలుదేరుతాయి

ఎన్నిసార్లు తెగినా గుప్పెడు కుట్లేసుకుని
తెగని బంధంలా
కాళ్లను చుట్టేసుకుని మురిసిపోతాయి

కొత్తవి కొనలేని పేదరికానికి
అరిగీ కరిగీ ఒళ్లంతా తూట్లు పడినా
చివరి రక్తపు బొట్టును కూడా
మన క్షేమానికే ధారపోసినట్టు
మళ్లీ మళ్లీ ప్రాణం పోసుకుని
పంటి బిగువున పల్లకీలా మోస్తాయి

చేరదీసిన కాళ్లను గుండెల్లో పెట్టుకుని
క్షేమంగా ఊరేగించటమే
వాటికి తెలిసిన ప్రేమ విద్య

అప్పుడప్పుడూ
మన కోపానికి ఆయుధాలు గానూ
నిండు సభలో అవినీతి రాజకీయ నాయకులకు
నిరసనతో చెప్పుదెబ్బలు గానూ మారుతాయి

మనుషుల్లా నమ్మించి గొంతుకోయవవి
ముళ్లు గుచ్చుకున్న సంగతి కూడా
మూడో కంటికి తెలియకుండా
మనల్ని నిత్యం కాపాడుతాయి

ముళ్లు చేసిన గాయాలెన్నిటినో
తమలోనే గుట్టుగా దాచుకుని
పాదాలను పసిపిల్లల్లా కాపాడుతూ
మనుషుల్ని మట్టంటకుండా గమ్యాన్ని చేరుస్తాయి!




**చిత్తలూరి**
91338 32246

# పద్యంలో గణిత విద్య

**మనుషుల మనసులను ఆనందింపజేసేది, ఆహ్లాదపరిచేది సాహిత్యం. హితాన్ని కోరేది సాహిత్యమనుకుంటే అందరికీ అర్థమయ్యే భాషలో ఉన్న సాహిత్యమే అధిక శాతం మనుషుల మనసులను ఆహ్లాదపరుస్తుంది. మధురానందాన్ని ప్రసాదిస్తుంది.**

అయితే ఒకప్పటి తెలుగు సాహిత్యంలో గ్రాంథిక పదజాల శాతం అధికంగా ఉండేది. అంతే కాకుండా జటిల గ్రాంథికంతో కొందరు, అర్ధ గ్రాంథికంతో మరికొందరు, సరళ గ్రాంథికంతో ఇంకొందరు కవులు పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, కథ, కవిత, నవల అంటూ రకరకాల ప్రక్రియలలో సాహిత్యాన్ని సృజించారు. ఆయా ప్రాంతాల యాసల పదజాలంతో కూడా కవిత్వమల్లిన మహాకవులు ఉన్నారు. గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకంలో విజయనగరం ప్రజల యాస, భాష ఎక్కువగా కనిపిస్తుంది.




తెలుగు సాహిత్యం అనగానే మనకు ఠక్కున పద్యం యాదికి వస్తుంది. పద్య కావ్యాలను రాసిన అనేకమంది సుకవులు, ఆశు కవులు, మధుర కవులు, చిత్ర కవులు యాదికి వస్తారు. తెలుగు సాహిత్యానికి ఉన్న అతిపెద్ద ఆస్తి పద్యం అని కొందరు సాహితీప్రియులు అంటారు. పాడుకోవడానికి అనువుగా ఉండే తెలుగు పద్యం అనగానే పాత తరం వారికి తిరుపతి వేంకట కవుల 'బావా యెప్పుడు వచ్చితీవు.. 'చెల్లియో చెల్లకో', 'జెండాపై కపిరాజు', 'తమ్ముని కొడుకులు సగపాలిమ్మనిరి', 'ముందుగ వచ్చితీవు..' వంటి పద్యాలు, బలిజేపల్లివారి 'బాలసూర్య ప్రభా కలితంబై' వంటి పద్యాలు, పోతన రచించిన 'పలికెడిది భాగవతమట.. పలికించెడి వాడు రామభద్రుండట', 'కారే రాజులు రాజ్యముల్ గల్గవే'.. 'సిరికింజెప్పడు'.. 'నల్లని వాడు పద్మ నయనంబులవాడు',' శ్రీకృష్ణా! యదు భూషణ' వంటి పద్యాలు, అలాగే వేమన, బద్దెన పద్యాలు యాదికి వస్తాయి. (తెలంగాణ తెలుగు భాషా దినోత్సవం సందర్భాన కేసీఆర్ రాసిన 'నవ్వవు జంతువుల్ మనిషి నవ్వును...' పద్యం కూడా అర్థవంతంగా ఉంటుంది)

అయితే కొందరు ఆధునిక కవులు పద్యాన్ని పాతిపెట్టి, ఛందో సంకెళ్లను తెంపి అందరికీ అర్థమయ్యే వచనంలో కవిత్వం రాయండి అని అన్నారు. మరికొందరు తెలుగు కవులు ప్రజల హృదయాలలో ఏనాడో పద్యాలను పాతిపెట్టామన్నారు. ఇలా ఎవరిష్టం వచ్చిన రీతిలో వారు తెలుగు సాహిత్య కవనావేశాన్ని ప్రదర్శించారు. ఏదేమైనా కొందరు తెలుగు కవులు కొంతకాలం వచన కవిత్వం రాశారు. అయితే వారి వచన కవిత్వాన్ని సైతం నేడు చదివేవారు తక్కువయ్యారు. మళ్లీ ఇప్పుడు కొందరు తెలుగు కవులు మాత్రా ఛందస్సున అంత్య ప్రాసలతో కూడిన కవిత్వం రాస్తున్నారు.

తెలుగు ఛందస్సుతో కూడిన పద్యాలలో ఉత్పలమాల, చంపకమాల, మత్తేభం, శార్దూలము, మత్తకోకిల, తరళము, కందం, సీసం, ఆటవెలది, తేటగీతి, ద్విపద వంటి పద్యాలు ఉంటే మాత్రా ఛందస్సులో మధురిమలు, వెన్నముద్దలు, చిమ్నీలు, వెన్నెలమ్మలు, భువన (ప్రాస, అంత్యప్రాసలతో మాత్రా ఛందస్సున నాలుగు పాదాలతో కూడిన భువన అనే పేరుగల పద్యం ఈ వ్యాస రచయిత రూపకల్పన) మురళి వంటి పేర్లు గల రకరకాల మాత్రా ఛందస్సు పద్యాలను ప్రస్తుతం కొందరు యువ కవులు రాస్తున్నారు. మనసులోని భావాలను పొందికగా ఆచితూచి చెప్పడానికి ఛందస్సు ఉపయోగపడుతుందని ఛందో ప్రియులు చెబుతుంటారు. భాషను ఆచితూచి పద్యంగా చెప్పడానికి ఛందస్సు ఉపయోగపడుతుంది.

> **కవిత్వం రాసే వారు తెలుగు పద్యం రాయాలంటే వారికి మనో భావనతో పాటు కొంతైనా ఛందో పరిజ్ఞానం ఉండాలి. ఛందో పరిజ్ఞానం కావాలంటే కొంత అభ్యాసం ఉండాలి. తెలుగులో అప్పకవీయం, కవిజనా శ్రయం, గోవర్ణ ఛందస్సు, అధర్వణ ఛందస్సు, కవి వాగ్బంధము, తాతంభట్టు ఛందో దర్పణం, అనంతుని ఛందో దర్పణం వంటి అనేక ఛందో శాస్త్ర గ్రంథాలు పద్యాలలో ఉన్నాయి.**

తెలుగు సాహిత్యంలోని తెలుగు పద్యం కేవలం మానసిక ఆనందాన్ని కలిగించడానికే ఉందంటే నేటి విద్యా ప్రపంచంలో దాని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. అందరి మానసిక ఆనందం ఒకే రీతిన ఉండదు. కాబట్టి పద్యం ద్వారా మానసిక ఆనందాన్ని పొందేవారు పద్యం ద్వారా పొందితే.. రకరకాల కవితా ప్రక్రియల ద్వారా ఆనందాన్ని పొందేవారు వాటి ద్వారా పొందుతారు. దండి మహాకవి వంటి వారు 'కావ్యం యశసే అర్థ కృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యః పర నిర్వృత్త యే కాంతా సమ్మిత తయోపదేశ యుజే' అంటూ కావ్య ప్రయోజనాలను చాలా చాలా ఉన్నత స్థాయిలో చెప్పారు. అనగా కావ్యం వలన కీర్తి, వ్యవహార జ్ఞానం, అమంగళ నివారణ, తత్కాల పరమానందం, ధర్మోపదేశం కలుగుతాయని అర్థం. అయితే దీన్నంతా ఈ కాలానికి అన్వయించుకోవచ్చా? అంటే అది వేరే విషయం. ఏది ఏమైనా తెలుగు పద్య రచనకు ఉపయోగపడే ఛందో మూలాలు సామాన్యంగా లేవు. అవి గణిత జ్ఞానంతో ప్రకాశిస్తున్నాయి. ఆ గణితంలో ఆధునిక గణితం అందంగా అర్థవంతంగా ఉంది. ఛందో అభ్యాస మూలాల్లోకి సశాస్త్రీయంగా వెళితే అక్కడ ఆధునిక గణిత ఛాయలు మస్తుగా కనిపిస్తాయి. అవి నేటి విద్యా ప్రపంచానికి పుష్కలంగా ఉపయోగపడతాయి.

వేదాంగాలలో ఒకటైన ఛందస్సు వేదపురుషుని పాదాలని అంటారు. వేద ఛందస్సు ఏ మంత్రంలో ఎన్ని మాత్రలు ఉన్నాయి? వాటిలోని గణాలు ఎలా ఉంటాయి? మన మనోభావాన్ని ఏ ఛందస్సులో ఉంచితే అది తేజోవంతమవుతుంది? వంటి విషయాలను వివరిస్తుంది. వేదాంగాలలోని ఛందో శాస్త్రం ఆధునిక గణిత శాస్త్రంలోని కొన్ని అంశాలకు అతి దగ్గరగా ఉంటుంది. అందరికీ అర్థమయ్యే రీతిలో చెప్పాలంటే ఛందస్సులో రెండే రెండు గుర్తులు ఉంటాయి. అవి 1.గురువు (U) 2. లఘువు (I). ఈ రెండింటి సహాయంతోనే వివిధ రకాల గణాలు పుడతాయి. ఆ గణాలతో రమారమి 42 కోట్ల పద్యాలు ఆవిర్భవిస్తాయి. కంప్యూటర్ భాషలో కూడా రెండే రెండు గుర్తులు సున్నా (0), ఒకటి (1) మాత్రమే ఉంటాయి. ఆ రెండు గుర్తులే ద్విసంఖ్యా మాన భాషను సృష్టిస్తున్నాయి. అంతేగాక ఛందో గణ ప్రస్తారాల ద్వారా బీజ గణిత సూత్రాలను, ప్రవచన గణిత అమరికల వంటి అనేక గణిత సూత్రాలను రూపొందించవచ్చు. అంటే ఛందోశాస్త్రం ద్వారా విద్యా ప్రపంచానికి రమారమి 42 కోట్లకు పైగా గణిత సూత్రాలను అందించవచ్చు.

అలాంటి ఛందో ధర్మాన్ని మేధస్సులో నిక్షిప్తం చేసుకుని అందులో మనోభావాలను పదిలపరిస్తే వచ్చే విజ్ఞాన స్వరూపమే తెలుగు వారి పద్యం. ఇవన్నీ తెలుసుకోకుండా కూడా తెలుగు పద్య ప్రియులు నాలుగు పద్య లక్షణాలను తెలుసుకుని పద్యం రాయవచ్చు.



**వాగుమూడి లక్ష్మీ రాఘవరావు**
98494 48947

అయితే అందులో వారి మనోభావాలు వికసిస్తాయి తప్పించి, జ్ఞానభావాలు వికసించవు. నవగణ సూత్ర రూపకల్పనకు శ్రీకారం చుట్టవు. ఛందస్సుతో కూడుకున్న తెలుగు పద్యాలను పరిహసించడమంటే సశాస్త్రీయ గణితాన్ని పరిహసించడమే. కొందరు లెక్కించడం చేతకాని వాడు లెక్కలోకి రాడంటారు.

మన తెలుగు సాహిత్యంలో ఛందో భరిత పద్యం మేధో పరంగా మరింత లోతులకు వెళ్లింది. అదే పద్యంలో పద్యం.. గర్భ కవిత్వం. అనగా రెండు పద్య లక్షణాలు గల ఏకపద్యంలో మనోభావం ఉంచడం. ఇక్కడ భావం, లక్షణం రెండూ ప్రధానమేనని చెప్పాలి.

> **ఒక పద్యంలో అనేక పద్యాలు ఇమిడి ఛందో దోషాలు, అర్థ దోషాలు లేకుండా కనపడే పద్యాలే గర్భ కవిత్వ పద్యాలని అప్పకవి గర్భ కవిత్వం గురించి చెప్పారు. పద్యంలో ఛందో దోషం వచ్చిందంటే గణ దోషం వచ్చిందని అర్థం. అదే ఆధునిక భాషలో చెప్పాలంటే గణిత దోషం వచ్చిందని అర్థం.**

ఉదాహరణకు గణిత పరంగా చెప్పాలంటే ఏ ప్లస్ బీ హోల్ క్యూబ్ సూత్రంలో ఏ ప్లస్ బీ హోల్ స్కేర్ సూత్రం ఉంటుంది. ఇక్కడ రెండు సూత్రాల ధర్మాలు ఉంటాయి. ఇదే రీతిన మన కవులు చంపకమాల గర్భ కంద పద్యం, కంద గర్భ మణి గణ వృత్తం, సీస గర్భ గీత పద్యం వంటి అనేక గర్భ కవిత్వ పద్యాలు రాసిన వారు ఉన్నారు. అనగా వారు రాసిన చంపకమాల గర్భ కంద పద్యంలో చంపకమాల పద్య లక్షణాలు కంద పద్య లక్షణాలు రెండూ ఉంటాయి. అలాగే మిగతా వాటిలో కూడా రెండు పద్య లక్షణాలు ఉంటాయి. అంతేగాక వాటితో పాటు వారి మనోభావన కూడా ఉంటుంది.

(ఇంకా ఉంది)



## కల్లు గీత

నేను తాళ్లల్లో తారాడుతూ
పెరుగుతున్న క్రమంలో
కులపోళ్లంతా తాళ్లెక్కుతుంటే
నిశితంగా గమనించే నా కళ్లు
అస్త్రాల పొది ముస్తాదు పైనే!
మనసంతా దాని సృష్టి లోగుట్టు పైనే!

నా ఊరి తోలు శాస్త్రవేత్త
తోలు వలిచి నానబెట్టి
సున్నం పూసి ఆరబెట్టి ముస్తాదు చేస్తున్న చేతుల్లో కళ
మరో వృత్తిని నిలబెట్టిందనే సత్యం నేనెరిగింది!

కొలిమిలో మండుతున్న ఇనుప కడ్డీల ఎరుపు
మలచబడబోతున్న కత్తుల పదునుకే తెలుసు
అన్నీ కత్తులే! అన్నీ కోసేవే! మట్టలు నరికేది! గెల గీసేది!
ముంజలు కొట్టేది!
తేడా గీసే వాడికే ఎరుక
వాడు చెబుతుంటే వంపులు వాలులు సరిసే కమ్మరి
నైపుణ్యం! గీత వృత్తికే పునాదిరాయి!

తాటి నారతో పేనిన మోకు
గర్రి మట్ట తడపల చుట్టుతో స్వహస్తాలతో తయారు
నడుము చుట్టూ పెనవేసుకుని పోగా
కాళ్ల బంధం ఆసరాగా ఎక్కుతుంటే
అరచేతులు పాదాలు కంది ఆనెలై
బాధిస్తున్నా ఆగదు జీవన పోరాటం!

కోడి కంటే ముందే లేచి
ముస్తాదు నడుముకి బిగించి కట్టుకుని
నక్షత్రాలు దారి చూపుతుంటే
బతుకు యుద్ధానికి వెళ్తున్న కార్మికుడిని!

ఆకురాయితో కత్తుల పదును పెట్టుకుని
పైపైకి ఎగబాకుతుంటే ఎవరెస్ట్‌ను ఎక్కేస్తున్న భావన

పోతు పరుపు తాళ్ల ఎడ గీత సంధ్య రాకముందే ముగింపు!
గీతలో ఆరితేరిన నేను ఒడిసే ఒక్కో బొట్టు లొట్టిలో
రాలుతుంటే నా కళ్లు ఆనందబాష్పాలు రాల్చు!

ఆకాశాన్నంటిన చెట్టు నా కోసమే గెట్టున
నిరీక్షించే ప్రియురాలు!
రాత్రంతా తాను రాల్చిన పాలు ఒడిసి పట్టిన లొట్టి
పొంగేలోపే నేను రావాలనే ఆశతో నా దారి వైపు చూపు


ఒక్కో చెట్టు ఒక్కో గెల గీసే గీత వైవిధ్యం
పారే కల్లు రుచి భిన్నం!
అనుభవంతోనే గీతలో గొప్పదనం రాటు దేలు!



**గిరి ప్రసాద్ చెలమల్లు**
94933 88201

భారతదేశంలో కుల వివక్షతను వేలెత్తి చూపడమే కాకుండా దాని నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు, బహుజన ఉద్యమ స్ఫూర్తిప్రదాత, సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే. ఆధునిక కాలంలో పూర్తి ఆధునిక దృక్కోణంతో బహుజన సమస్యను విశ్లేషిస్తూ సకల ఆధిపత్యాలపై తిరుగుబాటు జెండా ఎగరేసి బీసీ, ఎస్సీల ఆత్మగౌరవం కోసం, సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటం చేశారు. భారతదేశ సామాజిక పునర్వికాస ఉద్యమానికి మూలపురుషుడు. తన సతీమణి సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పించి తనతో పాటుగా సంఘసంస్కరణ కోసం కృషిచేసేలా తీర్చిదిద్దారు. ఆ దంపతులు అందించిన స్ఫూర్తిని ప్రతిఒక్కరూ తమ మనసుల్లో నింపుకోవాలన్న ఉద్దేశంతో వనపట్ల సుబ్బయ్య, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్‌ల సంపాదకత్వంలో 'ధిక్కార' కవితా సంకలనం రావడం హర్షించదగిన విషయం.

# బహుజనోద్యమ చైతన్యదీప్తి ధిక్కార



**ధిక్కార కవితా సంకలనంలో 156 కవితలు ఉండగా.. అవన్నీ పాఠకులను చైతన్యపరిచేవే.** కులాధిపత్యం కోసం మతం, దేవున్ని ఏ విధంగా వాడుకున్నారో జూకంటి జగన్నాథం రాసిన 'కొత్త ఊపిరి' కవిత తేటతెల్లం చేసింది. 'వేల ఏండ్ల నుంచి భుజాలు అరిగే వరకు/ మోసిన అగ్రవర్ణాన్ని బరువై దించేందుకు తల్లడిల్లుతుంటే/ మతాన్ని, దేవుని ప్రతిభను వెంట తీసుకువచ్చారు' అని స్పష్టపరిచారు. 'అస్థిపంజరాల అస్తిత్వ ఉద్యమం మొదలైంది/ బీసీ కుంజరాల ప్రభంజనం దిగంతాల ధ్వనిస్తుంది' అని 'బీసీ ప్రభంజనం' కవిత ద్వారా అమ్మంగి వేణుగోపాల్ తెలియజేశారు.

'క్షమించు' కవితలో కవయిత్రి గోగు శ్యామల.. 'నీవు గులాంగిరిపై చెర్నకోలను మా చేతికందించినవ్/ అయినా మాకు సోయి లేదు క్షమించు క్షమించు' అంటూ బహుజనుల్లో అస్తిత్వ స్పృహ ఇప్పటికీ లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తీకరించారు. అన్నవరం దేవేందర్ రాసిన 'విప్లవ సుతారి' కవితలో.. 'మూలవాసుల మూల సుక్క/ బహుజన జీవితాల తూర్పు రేఖ/ బానిస భావాల ముక్తి ప్రదాత/ నిత్యం రగరగ పొడుస్తున్న పొద్దు' అంటూ పూలేను నిత్య చైతన్య మూర్తిగా అభివర్ణించారు.

'నాలుగో కన్ను' కవితలో.. 'ఉదయానికి ముందు ఎరుపెక్కిన తూరుపులా/ ప్రసవానికి ముందు తల్లి పెట్టిన పెనుకేకలా/అదిగో ప్రయాణం అదిగో మహాయానం' అంటూ బహుజన రాజ్యాన్ని జూలూరి గౌరీ శంకర్ బలంగా కాంక్షించారు. జ్వలిత రాసిన 'జ్ఞానఖడ్గమా' కవితలో.. 'ప్రజలను విద్యకు దూరం చేసిన/ స్వార్థ దోపిడీ ముఠాల వీధి నాటకాలను ఉత్తరించ/ అంటకత్తెరపై మొలిచిన ప్రశ్నల అంకురమా' అంటూ శూద్రుల కోసం పూలే పడిన తపనను గుర్తు చేశారు. 'శతాబ్దాల పొడుగు సాగిన కొత్తకొత్త కిరాతకత్వాల ఎత్తుగడలెన్నున్నా/ చేతనత్వాన్ని రగిలించినవాడు పూలే' అంటూ వేణు సంకోజు 'చేతన జ్వాల' కవిత ద్వారా తెలియజేశారు. 'నాలుగు తలల నాగశిరసుపై/ కాళియమర్దన తొలిపాదం పూలే' అంటూ బి.నర్సన్ 'జాతిపిత' కవితలో పూలే పోరాటాన్ని దృశ్యమానం చేశారు.

'కులం ముండ్ల మీద గులాబీలు మొలిపించి/ భారతీయ ఎడారి బతుకుల్లో/ పూలు పూయించిన పూలే అతడు' అంటూ 'కలల పూల తోట మాలి' కవిత ద్వారా తైదల అంజయ్య వ్యక్తీకరించిన విధానం బాగుంది. పూలేను తండ్రీ అని సంబోధిస్తూ బూర్ల వెంకటేశ్వర్లు రాసిన 'పురాణ సారమెల్ల' కవితలో.. 'ఎన్ని వేషాలు విప్పి చెప్పినవ్ తండ్రీ/ ఎన్ని మోసాలు బండగొట్టినవ్ తండ్రీ' అంటూ అవతారాల గుట్టును పూలే ఎలా రట్టు చేశారో వివరించారు.

'అక్షర జ్ఞానం లేక స్త్రీ బానిస అయినప్పుడు/ నువ్వు మనిషిని ఖడ్గంగా నిలబెట్టావు' అంటూ డాక్టర్ వెల్దండి శ్రీధర్ 'నువ్వు లేని కాలంలో' కవిత ద్వారా పూలే తత్వాన్ని కవిత్వీకరించారు. 'సాగిలబడ్డ మా ఎన్నెన్నో దేహాల్ని/ మళ్లీ నీ కళ్లు లేపి నిలబెడుతున్నాయ్ మహాత్మా' అంటూ జి.లక్ష్మీనరసయ్య రాసిన కవితా పంక్తులు పూలే నుంచి పొందిన స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. 'కుహనావాదుల కుట్రలను జ్ఞానఖడ్గమై ఛేదించిండు/ గూడు కట్టుకున్న సంకుచిత భావాలను సమూలంగా తుడిచిపెట్టి/ సంస్కరణ దృక్పథ బావుటాను ఎగరేసిండు' అంటూ డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య 'జ్ఞాన భాస్కరుడు' కవిత ద్వారా పూలే గొప్పతనాన్ని తెలియజేశారు. 'కాలం పొరల కింద కదులుతున్న/ సత్యాన్ని వెలికితీసిన ప్రయోగ శోధకుడివి' అంటూ డాక్టర్ ఎస్.రఘు 'నిర్మాణాత్మక విధ్వంసం' కవిత ద్వారా చెప్పిన విధానం బాగుంది.

'నువ్వు గుర్తొస్తున్నప్పుడల్లా/ లోపలేదో వెలుగుతుంటుంది' అంటూ పూలే ద్వారా తాను పొందిన స్ఫూర్తిని సీతారాం తెలియజేశారు. 'జాతి రత్నమై మెరిసెనే పూలే/ జ్యోతిగా వెలుగునిచ్చెల ఘనమైన పూలే చరిత దెల్సుకోని/ జగమందు మన భవిత రాసుకుందామా' అనే పల్లవితో సాగే 'జాతిరత్నమై మెరిసెనే' అనే పాట ద్వారా అంబటి వెంకన్న పూలే చేసిన కృషిని వివరించారు. 'నాలుగు బాటల కాడ నువ్వు/ ఇవాళ ఉత్త విగ్రహానివే కాదు/ నాలుగు వేల ఏండ్ల ఈ దేశ ఆత్మగౌరవ పతాకానివి' అంటూ డాక్టర్ పసునూరి రవీందర్ కవితా నీరాజనమిచ్చారు.

'అవమానాల్ని అనుభవాల కొలిమిలో సరిసి/ అక్షరాయుధాల్ని చేసుకున్న అక్షరయోగి/ అసమానతల రూపురేఖల్ని మార్చేసిన ఆధునిక సంస్కర్త' అంటూ డాక్టర్ బాణాల శ్రీనివాసరావు 'బహుజన ధ్రువ తార' కవిత ద్వారా తెలియజేశారు. 'నా అక్షరాలతో దండ కడియాలు చేయించిన/ నువ్వొచ్చె దారిలో నల్లగొంగడి పరిచిన/ ఎర్ర రుమాలు కట్టిన పూలే తాతా!/ నువ్వు వేసిన బాటగుండనే రా/ నీ ముని ముని మనవండ్ల పిల్లలను చూసి పో/ సత్యశోధన పండ్లు పంచిపో' అంటూ పూలే పునరాగమనాన్ని తగుళ్ల గోపాల్ ఆకాంక్షించారు.

'ఆవరించిన అమావాస్యలను చెరిపివేసి/ శూద్రావనిలో సూర్యోదయమయ్యావు/ బడికి 'మడి'గట్టిన చాందసవాదాన్ని ధిక్కరించి/ ఒడినే బడిగా మలచి బతుకు విలువను బోధించావు' అంటూ సావిత్రిబాయి పూలే గొప్పతనాన్ని కోయి కోటేశ్వరరావు 'తల్లీ! నిన్ను దలంచి' కవిత ద్వారా ఆవిష్కరించారు. 'ధ్వజమెత్తిన అగ్రహార అహంకారాలపై/ అధర్మ విలయతాండవాలపై/ మనుధర్మాల మారణ హోమాలపై/ సత్యశోధకుని పాలికేక/ తొలి కోడి జ్ఞానకూత/ ఉద్యమతరంగ జలపాతం' అంటూ 'దారి దీపం' కవిత ద్వారా వనపట్ల సుబ్బయ్య పూలేను కీర్తించారు.

ఇలా అన్ని కవితలను స్పృశించ లేకపోయినా ప్రతీ కవిత పూలే దంపతుల సంఘసంస్కరణ దృక్పథాన్ని, జీవితాంతం అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన తీరును, అగ్రవర్ణ ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించిన విధానాన్ని తమ తమ కవితల ద్వారా ఆవిష్కరించారు. స్తబ్దంగా ఉన్న సమాజంలో ఒక అలజడిని సృష్టించి గుండె గుండెలో ఉద్యమ స్ఫూర్తిని నింపడానికి ప్రయత్నం చేశారు. పూలే దంపతులు చూపిన మార్గంలో మనందరి ప్రయాణం కొనసాగినప్పుడే ఈ కవితా సంకలనం సంపాదకుల కృషి ఫలించినట్లవుతుంది. కవితలకు సార్థకత లభిస్తుంది. ■



**డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య**
97047 31346

## గతపు బాధలింక కడలిలో...


**గతపు బాధలింక కడలిలో కలుపుచు
వర్తమానమందు పరుగులిడుచు
పడియు లేచు కెరట వడిని వొడిసిపట్టి
భవితతీర్చి దిద్దు భరతవీర!**

**వ్యసనముల వీడి వ్యవసాయమునుజేసి
కలిసి మెలిసి బ్రతుక కలిమికలుగు
స్వార్థమెంతో చెడుగు సహవాసము జెరచు
చీడ పురుగు చెట్ల జెరచినట్టు.**

**పేదవారు కలిసి ప్రీతిగా బ్రతికిన
వేరుపరచజూచు పెద్దవారు
చిన్న లాభమునకె చిందులేయుటమాని
బ్రతుకు బాగు పడెడు బాట నడువు.**

**మంచివాడని యొకనినె యెంచి నమ్మి
వంచనకు లోనగుట నేడు గాంచుమయ్య
వ్యక్తి యారాధనెంతో యనర్థమిడును
మూఢభక్తివలెనె ముంచగలదు.**

**అడుగకుండగనె ధనమునాశజూపి
నీదుసాయమున పదవికెక్కువాడు
నొప్పితెలియకుండనెనిన్ను పీల్చగలడు
జలగరీతిగ నిజమిదె తెలుసుకొనుము.**






**చిలకమర్రి కృష్ణమాచార్యులు**
99855 13883

## ఆహ్వానం

### ఆవిష్కరణ

**తెలంగాణ** భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 12న సాయంత్రం 6 గంటలకు డా.తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాలు 'అన్వేషణ' ఆవిష్కరణ సభ జరగనున్నది. డా.నాళేశ్వరం శంకరం సభాధ్యక్షత వహించనుండగా.. డా.నందిని సిధారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, ఆవిష్కరిస్తారు. డా.వి.శంకర్ గ్రంథ సమీక్ష చేస్తారు. డా.ఏనుగు నరసింహారెడ్డి, డా.మామిడి హరికృష్ణ, బైస దేవదాస్ ఆప్తవాక్యం చేస్తారు. కందుకూరి శ్రీరాములు, డా.బెల్లంకొండ సంపత్‌కుమార్ తదితరులు హాజరవుతారు.

### సదస్సు

హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు 'దళిత చరిత్ర– సంస్కృతి– సాహిత్యం పునర్ మూల్యాంకనం– ఖాళీల పూరింపు' రౌండ్ టేబుల్ సదస్సు జరగనున్నది. గుడిపల్లి నిరంజన్ సభాధ్యక్షత వహిస్తారు. హెచ్‌సీయూ ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు సభను ప్రారంభించనుండగా.. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. డా.సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన ''ఇమానం' విస్మృత దళిత చైతన్యం'' పుస్తకాన్ని ప్రొఫెసర్ చింతకింది కాశీం, ''దళితోద్యమ వేగుచుక్క 'భాగ్యరెడ్డి వర్మ'' పుస్తకాన్ని ఆచార్య లింబాద్రి ఆవిష్కరిస్తారు.

### పురస్కారం

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 13న సాయంత్రం 5 గంటలకు గోదావరి గొంతుక మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదాన సభ జరగనున్నది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సభాధ్యక్షత వహించనుండగా.. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని, పురస్కార ప్రదానం చేస్తారు. మోహన్ రుషి, పసునూరు శ్రీధర్‌బాబు పురస్కారాలు అందుకోనున్నారు. సిటీ కాలేజీ తెలుగు శాఖాధ్యక్షులు కోయి కోటేశ్వరరావు వక్తగా వ్యవహరిస్తారు.